నిలిచిన 'డీటీసీ' సేవలు

- నెలరోజులుగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పోస్ట్ ఖాళీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

హసన్‌పర్తి: ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పోస్టును ఎప్పుడు భర్తీ చేస్తారో అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు. నెల రోజులుగా ఈ పోస్ట్ ఖాళీగా ఉంటోంది. ఇక్కడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పనిచేసిన డాక్టర్ పుప్పాల శ్రీనివాస్.. ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేసి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అతన్ని అదుపులోకి తీసుకుని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి నుంచి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పోస్ట్ భర్తీకి నోచుకోలేదు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలను కూడా ఎవరికీ అప్పగించలేదు.


హసన్‌పర్తిలోని డీటీసీ కార్యాలయం

వాహనదారుల ఎదురుచూపులు

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కుర్చీ ఖాళీతో ఆ అధికారి అందించాల్సిన సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. నేషనల్ పర్మిట్ వాహనదారులు, వికలాంగులు లైసెన్స్‌ల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కిందిస్థాయి అధికారులపై అజమాయిషీ కొరవడింది. సేవలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డీటీసీని నియమించి సేవలను ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎదురుచూస్తున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి

వరంగల్: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగు నీటి నిర్వహణ, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అంకిత్ కుమార్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

వేసవికాలంలో తాగునీటి సమస్య, కరెంట్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ శాఖల అధికారులు వేసవికాలం యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, అగ్రికల్చర్, మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీఓ కల్పన, తహసీల్దార్ ఇక్బాల్, కలెక్టరేట్ ఏఓ విశ్వప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్, అధికారులు

మాదిగలపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ


రిలే దీక్షలను ప్రారంభిస్తున్న కుమార్ మాదిగ

వరంగల్ అర్బన్: మాదిగలపై తెలంగాణ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ విమర్శించారు. రిజర్వేషన్ల వర్గీకరణ తర్వాతే ఉద్యోగ ఫలితాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేపట్టిన రిలే దీక్షలను మంద కుమార్‌మాదిగ, నాయకులు వేల్పుల సూరన్న, మహేందర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఒకపక్క ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉంటున్నామని మాయమాటలు చెబుతూ మరోపక్క వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలను చేపట్టడం సిగ్గుచేటని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


హన్మకొండ: మాట్లాడుతున్న భిక్షపతి

చట్టబద్ధత తర్వాతే నియామకాలు చేపట్టాలి

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. గ్రూప్స్, ఇతర ఉద్యోగాల ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించిన క్రమంలో నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం రెండోరోజుకు చేరాయి. ఈ దీక్షలను కర్రె భిక్షపతి ప్రారంభించి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ చేపట్టే ఉద్యమాలకు సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ సంఘీభావం తెలిపారు.

ఎర్రగట్టు గుట్ట జాతర ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతర పనులను పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సోమవారం పర్యవేక్షించారు. హోలీ పండుగ నుంచి ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల తాకిడి ఎలా ఉంటుందో అడిగి తెలుసుకున్నారు. అందుకనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులకు వివరించారు. ఆరుగురు ఎస్సైలు, ఎనిమిది మంది ఏఎస్సైలతో పాటు మహిళా కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకట్రావు, ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, మాధవ్, దేవస్థాన ధర్మకర్త వెంకటస్వామి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ భీమారం శాఖ అధ్యక్షుడు మార్క్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పారా జూడో విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న కమిషనర్

రామన్నపేట / వరంగల్ అర్బన్: ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీల్లో ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలో జరిగిన 13వ నేషనల్ పారా జూడో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన నగరంలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలకు చెందిన జి.వినోద్‌కుమార్, హరిహరణ్, పి.నాగరాజు, వి.జీవన్, శ్రీకాంత్‌ను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం అభినందించారు. మే 8 నుంచి 16వ తేదీల్లో జరగనున్న వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన జి.వినోద్‌కుమార్, పి.నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు.


ఖిలా వరంగల్: విశ్వజిత్‌ను అభినందిస్తూ..

జిల్లాస్థాయి చెస్ పోటీల విజేతకు సన్మానం

ఖిలా వరంగల్: ఇటీవల హనుమకొండలో యునైటెడ్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఓపెన్ టూ ఆల్ చెస్ చాంపియన్ షిప్ -2025 పోటీల్లో కరీమాబాద్ న్యూ కొటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్ విద్యార్థి పి.విశ్వజిత్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడని పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్ తెలిపారు. ఈమేరకు పాఠశాలలో విశ్వజిత్‌ను కరస్పాండెంట్‌తో పాటు హెచ్‌ఎం కోడం సబిత సోమవారం అభినందించారు.

సంక్షిప్తంగా

పుష్‌పుల్ రైలును పునరుద్ధరించాలి

ఖిలా వరంగల్: కాజీపేట నుంచి డోర్నకల్ మీదుగా విజయవాడ వెళ్లే పుష్‌పుల్ రైలును పునరుద్ధరించాలని ప్రయాణికుడు బత్తుల శ్రీధర్ కోరారు. ఈమేరకు వరంగల్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆరె కటిక మహాసభను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం జరగనున్న ఆరె కటిక మహాసభను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోగికార్ రవీందర్ పిలుపునిచ్చారు.

కాలనీలో రోడ్లు, డ్రెయినేజీల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో బల్దియా జవాన్లతో కలిసి కార్పొరేటర్ పల్లం పద్మ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్రమైన డ్రెయినేజీలను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గేదెను అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

వరంగల్: భూపాలపల్లి జిల్లాలోని నాగారం గ్రామానికి చెందిన అంబాల పున్నంచందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టాటా మ్యాజిక్ వాహనంలో ఒక గేదెను అమ్మకానికి పున్నంచందర్ సోమవారం తీసుకువచ్చాడు.

వెంకన్న ఆలయంలో ఊంజల్ సేవ

కాజీపేట: 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఊంజల్ సేవను ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి దంపతులు, భక్తులు సోమవారం తిలకించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట, టేకులగూడెం టౌన్, టేకులగూడెం బీసీ, ఎస్సీ కాలనీలు, సోమిడి వ్యవసాయ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం



హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హెప్సీబా సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఆమెకు ఇటీవల కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈమేరకు హెప్సీబాను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, స్టాఫ్ సెక్రటరీ ఎం.అరుణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్, స్టాఫ్ క్లబ్ సభ్యులు, కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు నిధులు పెంచాలి

హన్మకొండ: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేటాయించే నిధులను పెంచాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హనుమకొండలో సోమవారం విడుదల చేసి మాట్లాడారు. గత బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.9,300 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో మూడు శాతం కంటే తక్కువని అన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ కాజీపేట బ్రాంచ్, మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, రిటైర్డ్ కార్మికులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బిల్లులు చెల్లించాలి

హన్మకొండ: ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఈ - కుబేర్‌లో ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి కోరారు. వేతన సవరణ కమిషన్ సభ్యులు తయారు చేసిన నివేదికను తెప్పించుకుని ఇప్పుడున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

'తాళ్ల పద్మావతి'ని సందర్శించిన యూఎస్ ప్రతినిధులు



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలను అమెరికాకు చెందిన ఫాల్కనర్ యూనివర్సిటీ అధ్యాపక బృందం సందర్శించింది. విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థుల ప్రత్యక్ష ప్రవేశాలు, రెండు సంస్థల మధ్య పరస్పర సహకారం అనే అంశాలపై చర్చించడంతో పాటు ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, యూఎస్ ప్రతినిధులు కేసీ ఓక్లీ, జస్టిన్ బాండ్, తాళ్ల పద్మావతి కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, వరుణ్, డాక్టర్ ఆర్.వేలు, డాక్టర్ విజయలక్ష్మి, అఫ్జలున్నీసా, మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, అజిత్‌కుమార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల పరిశోధకుడు రామ్‌శెట్టి రాజేంద్రప్రసాద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డెవలప్‌మెంట్ అండ్ ఎవల్యూయేషన్ ఆఫ్ నానో ఫార్మలేషన్స్ ఫర్ సమ్ డ్రగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజేంద్రప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాయదా పర్యవేక్షణలో రాజేంద్రప్రసాద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రాము



హసన్‌పర్తి: పద్మశాలి సంఘం వంగపహాడ్ అధ్యక్షుడిగా ఇంజపురి రాము ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గుర్రపు రమేష్, ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా రంజిత్‌కుమార్, సలహాదారుడిగా రాజు ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ రవీందర్ వివరించారు.

నేత్రదానం


నర్సయ్య (ఫైల్)

హసన్‌పర్తి: ఓ వృద్ధుడు తాను చనిపోతూ మరో ఇద్దరికి చూపును ప్రసాదించాడు. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన మీసరకొండ నర్సయ్య (85) ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అనుమతి మేరకు నర్సయ్య నేత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది సేకరించారు. అనంతరం నర్సయ్య కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందజేశారు.

వేణుగోపాలస్వామి కల్యాణం



మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గ్రామ శివారులోని తోట వద్ద నుంచి అశ్వ వాహనంపై స్వామివారిని ఊరేగింపు తీసుకొచ్చి ఎదుర్కోళ్లు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు అర్చకులు వీరవెల్లి కేసరి, ముస్కే శ్రీకాంత్, వీరవెల్లి ఆచార్య కోవిద్ మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్లెపు నర్సయ్య, గౌరవ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దువ్వ విజయ్‌కుమార్, కార్యదర్శి నార్లగిరి సతీష్, కోశాధికారి కడార్ల నరేందర్, సహాయ కోశాధికారి బోగి దయాకర్ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది



కేయూ క్యాంపస్: అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవాపథకం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ చైర్మన్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నిర్ణయం.. శక్తివంతమైన సాధనం



హసన్‌పర్తి: లక్ష్యాన్ని సాధించడానికి దృఢ సంకల్పం, నిర్ణయం తీసుకోవడం శక్తివంతమైన సాధనాలు అని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ) సీఈఓ ఇస్మాయిల్ అక్బానీ అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి


కేయూ దూరవిద్యాకేంద్రం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, తదితరులు


వరంగల్ అండర్ బ్రిడ్జి ఇసుక అడ్డా వద్ద ఎస్సీ బాలికల హాస్టల్‌లో సావిత్రి బాయి పూలేకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ బాధ్యులు


హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే వర్ధంతిని నగర వ్యాప్తంగా సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి సేవలను కొనియాడారు. - సాక్షి నెట్‌వర్క్

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి

కేయూ క్యాంపస్: ఎయిడ్స్‌వ్యాధి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని గణిత విభాగం సెమినార్‌హాల్‌లో హనుమకొండ జిల్లాకు చెందిన యువజన సంఘాలకు లైంగిక వ్యాధులపై సోమవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని గుర్తుచేశారు. లైంగిక వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని సన్మార్గంలో పయనించాలని అన్నారు. హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ 15నుంచి 20 ఏళ్ల మధ్య యువత ఎక్కువగా ఎయిడ్స్ వ్యాధికి గురవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి స్టేట్ రిసోర్స్ పర్సన్ రిటైర్డ్ ప్రొఫెసర్ పింగిళి నర్సింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆడెపు రామకృష్ణ, మ్యాథ్ విభాగం అధిపతి భారవీశర్మ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ మల్లారెడ్డి, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి

వరద నీరు నిల్వకుండా చర్యలు


కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ: నగరంలో ఏ ప్రాంతంలోనూ వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. హనుమకొండలోని ఎన్జీఓఎస్ కాలనీ, వడ్డెపల్లి ఎస్సీ కాలనీ, రాఘవేంద్ర నగర్‌లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 57వ డివిజన్‌లో 100 అడుగుల రోడ్డు నుంచి కుడా కాలనీలోకి వెళ్లే దారిలో నాలాపై రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టు పనులకు భూమిపూజ చేశారు. పారిశుద్ధ్య పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మా రెడ్డి, బంక సతీష్, ఎర్ర మహేందర్, మండల సమ్మయ్య, చంద్రశేఖర్, నిఖిల్ కుమార్, మల్లారెడ్డి, కరణ్, జ్యోతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాజీపేట రూరల్: మహిళా దినోత్సవాన్ని కాజీపేట జంక్షన్‌లోని రైల్వే పార్కులో షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుమార్తె డాక్టర్ యోదారెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి మహిళలనుద్దేశించి మాట్లాడారు. అతివలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హనుకాంత్, బండెల చందు, సులోచన, యశోద, భాగ్య, సంధ్యకుమారి, రమేష్, రఫీ, కీర్తన పాల్గొన్నారు.


బహుమతి ప్రదానం చేస్తున్న యోదారెడ్డి

18న రాష్ట్రస్థాయి విద్యార్థుల సదస్సు



సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 18న యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు తెలిపారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం ఎదుట కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లోనే యూజీసీ నూతన ముసాయిదాను రూపొందించిందని ఆరోపించారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేసేలా కేంద్రం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కావ్య, బాధ్యులు అనూష, గణేష్, యాదగిరి, పెరియార్, సోమ, సాధన, శ్రీజ, చారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు శాఖ ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ 10వ శాఖను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ 1994లో ఆవిర్భవించిన బ్యాంకు.. రూ.400 కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, డీసీఓలు సంజీవరెడ్డి, ఎం.నీరజ, జగన్మోహన్ రావు, తోట సంపత్, వేణుగోపాల్ రెడ్డి, పాపిరెడ్డి, చంద్రమౌళి, గౌసుద్దీన్, సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే